
రూ.2 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ల వితరణ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలకు ప్రవాస భారతీయుడు పాటిల్ సత్యనారాయణరెడ్డి శనివారం రూ.2 లక్షల విలువైన 3 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సాహితి గగన్‌మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమాజంలో అందరూ సమానమే

అమరాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని పెనుకొండ సబ్‌కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని హేమావతి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సీసీ రోడ్లు, మరుగు కాలువలు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు ప్రజలు సబ్ కలెక్టర్ కార్తీక్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.ఏవైనా సమస్యలు ఉన్నాయా, పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా భవనం మంజూరైందని స్థల సమస్య ఉందని సూపర్‌వైజర్ కమలమ్మ తెలిపారు. హేమావతిలోని సిద్ధేరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ తదితరులు సబ్ కలెక్టర్‌ను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ మునిస్వామి, సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ సభ్యుడు ఓంకార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

రూ.1.65 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో రూ.1.65 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్ఎఫ్‌సీ నిధులతో సీసీ రోడ్డు పనులను చేపడుతామన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో వివిధ వార్డు సచివాలయాల పరిధిలో కూడా పలు అభివృద్ధి పనులను చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కమిషనర్ ప్రభాకరరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించడానికి అవసరమై చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ వెంకట లక్ష్మమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

రొద్దం: మండలంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 42 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 3 కార్లను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సెబ్ సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేలం వేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. రూ.8,41,340 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు



● ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం టౌన్: నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ శనివారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ మంచి జరుగుతుందన్నారు.

వివాదాస్పద రహదారి పరిశీలన

రొద్దం: చెరుకూరులో మడకశిర–పెనుకొండ ప్రధాన రహదారి నుంచి ఎస్సీ, బీసీ కాలనీకి వెళ్లే దారిని శనివారం పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ పరిశీలించారు. కాలనీకి వెళ్లేందుకు దారి లేదంటూ భూ యజమాని రోడ్డును ధ్వంసం చేయడంతో కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ భూ యజమానితో సమస్యపై చర్చించారు. పట్టాదారుడిని ఒప్పించి, కాలనీవాసులకు దారి చూపాలని తహసీల్దార్ అనంతచారిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన మహేష్ ద్విచక్రవాహనంలో లేపాక్షి వైపునకు వెళ్తుండగా శ్రీకంఠపురం చెరువు కట్టపై అదుపుతప్పడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంక్షేమ పథకాలు భేష్



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు నాగమ్మ. భర్త వెంకటరమణప్ప, కుమారులు, కోడళ్లతో కలిసి ధనాపురంలో నివసిస్తున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబానికి ఎటువంటి సిఫారసులు లేకుండా ప్రభుత్వ పథకాలు అందాయి. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలం పట్టా, ఇల్లు మంజూరైంది. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి పథకాలతో రూ.3,97,037 వరకూ లబ్ధి చేకూరింది. కుటుంబానికి అండగా నిలుస్తున్న జగన్ మేలు మరువలేం అని నాగమ్మ హర్షం వ్యక్తం చేస్తోంది.

- సీఎం జగన్ పేదలకు అండగా నిలుస్తున్నారు..
- ఆయనకు అండగా ఉంటాం
- ‘గడప గడపకూ మన ప్రభుత్వం’లో లబ్ధిదారుల హర్షం



పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: జగనన్న ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఆయనకు అండగా ఉంటామని లబ్ధిదారులు తెలిపారు. మండలంలోని శిరేకోళం, ధనాపురం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని వివరించి, పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఏం అక్కా..బాగున్నావా? ఏం పెద్దమ్మా.. పింఛన్ వస్తోందా? చెల్లెమ్మా.. అమ్మ ఒడి వచ్చిందా? అన్నా.. రైతు భరోసా అందిందా అంటూ ఆప్యాయంగా పలకరించారు.

సీఎం అందరికీ అండగా ఉన్నారు..

గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా ప్రజావసరాల దృష్ట్యా అదనంగా మరిన్ని పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటి వద్దకే అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా జరగడం లేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా అవినీతి అక్రమాలకు తావు లేకుండా, పార్టీలు, కులమతాలు, వర్గ విభేదాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇవన్నీ చూడలేని టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వారి కుట్రలు, కుతంత్రాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి చర్యలు..

శిరోకోళంలోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణకు ఆలయ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

అలాగే ఇటీవల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కోలుకుంటున్న ఎస్సీ కాలనీకి చెందిన చందకచర్ల నరసింహులు, రాజశేఖర్‌ను పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.60 లక్షల వ్యయంతో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జెడ్పీటీసీ శ్రీరామప్ప, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ నీరుగంటి ప్రభాకర్, ఎంపీటీసీ గంగాదేవి, కాణిపాకం ఆలయ ట్రస్ట్ డైరెక్టర్ మారుతీస్వామి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి, ఏఓ విజయభారతి, ఏపీఎం దేవానంద్ ఫిలిప్సన్ పాల్గొన్నారు.

కన్వీనర్లు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, నూతనంగా నిర్మితులైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే బాధ్యత సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలన్నారు. సాంకేతిక లోపాలను సవరించి ప్రజలకు మేలు చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు నిత్యం ప్రజల్లో ఉండి పార్టీని గెలిపించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. కష్టపడి పని చేస్తే 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు. నవరత్నాల్లోని పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచులు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, సతీష్, ఎంపీటీసీలు రామచంద్రప్ప, రాజు, కో–ఆప్షన్ మెంబర్ తౌసిఫ్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, నాయకులు కిష్టప్ప, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

సన్మానం..

మడకశిర: సచివాలయాల కన్వీనర్లు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. శనివారం మడకశిరలో చందకచర్ల తదితర సచివాలయాల కన్వీనర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, బజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీకంఠపురం వద్ద 15 ఇళ్లకు నీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా తాత్కాలిక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను చైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. శనివారం 8వ వార్డులోని ఎస్వీఆర్ పాఠశాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని 15 ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోవడంతో కౌన్సిలర్ గిరీష్‌తో కలిసి చైర్‌పర్సన్ వార్డులో పర్యటించారు. తాత్కాలిక పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోని సడ్లపల్లి చెరువులో పారిశ్రామికవేత్తల సహకారంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కును పరిశీలించారు. రోజూ ఆక్సిజన్ పార్కుకు మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ నీరజ, ఏఈ సురేష్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీని అభివృద్ధి పరచడమే లక్ష్యమని చైర్మన్ ఉమర్‌ఫారూఖ్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శంకరనారాయణ సహకారంతో అతి తక్కువ వ్యవధిలో పట్టణాన్ని సుందరంగా తయారు చేశామన్నారు. అనవసరంగా విమర్శలు చేస్తే బెదిరే ప్రసక్తే లేదన్నారు. 3వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ గిరి తమ ఏరియా అభివృద్ధికి ఏమాత్రం చర్యలు చేపట్టలేదని ఆరోపణలు చేయడంతో.. చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయలేదన్న సాకుతో కమిషనర్‌ను ఇష్టారాజ్యంగా దూషించడం సరికాదన్నారు. కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ మాట్లాడుతూ.. పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షల మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు తయాబ్, రఘునాథరెడ్డి, సద్దాం, శేషాద్రి, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, ఫర్జియాభాను, బోయ హారతి, నాగరత్న, షహనాబీ, అంజలి, సంజీవమ్మ, చంద్రకళ, లావణ్య, గీత, కో–ఆప్షన్ మెంబర్లు వెంకటరామిరెడ్డి, నేమతుల్లా, ముహీబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్

పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

హిందూపురం టౌన్: ఉద్యానవనాలను అభివృద్ధి చేసి, పట్టణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరా బెన్, ముక్కడిపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ అంజమ్మ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం అధికారులు 25 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎంజీఎం మైదానాన్ని అభివృద్ధి చేసి, పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డులో ఉన్న మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. మైదానం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. పురపాలక సంఘం వ్యాప్తంగా ఉన్న అన్ని రిజర్వ్‌డ్ స్థలాలను గుర్తించి, పరిరక్షించడానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, కమిషనర్ హరిబాబు, అన్ని విభాగాల అధికారులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



అమరాపురం: ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థినులతో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



హిందూపురం టౌన్: విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: మండల పరిధిలోని సీ.చెర్లోపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాల, పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వివిధ గురుకులాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరాపురం: బసవనపల్లి అమరాపురం ఉన్నత పాఠశాలతో పాటు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

గోరంట్ల: మండల పరిధిలోని బూదిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 8 వతరగతి విద్యార్థులకు మార్కెట్ యార్డు చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ట్యాబ్‌లు అందజేశారు.

సోమందేపల్లి: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు శనివారం ఎంపీపీ గంగమ్మ ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

గుడిబండ: పి.సి.గిరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సర్పంచ్ యంజారేగౌడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

లేపాక్షి: కొండూరు పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి ట్యాబ్‌లు అందజేశారు.









వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

పరిగి: ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఊటుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డిని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ దిలీప్‌కుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు అమరావతి, మారుతీరెడ్డి, నాయకులు గంగాధర్‌రెడ్డి, సంజప్ప పాల్గొన్నారు.

అమరాపురం: మండల పరిధిలోని నిడ్రగట్ట ఎంపీటీసీ సభ్యురాలు అనసూయమ్మ భర్త ఈరన్న (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్నన్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈరన్న మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తి, నారాయణ, ప్రసాద్, తిప్పేస్వామి, త్రిలోక్‌నాథ్, శ్రీనివాసరెడ్డి, గోవిందరాయ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో శనివారం అధికారులు హౌసింగ్ డే నిర్వహించారు. లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈ నాగరాజు, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో మండల కేంద్రంలో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, సర్పంచ్ రూప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోనీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌గోపాల్‌రెడ్డి, వజీర్, కో–ఆప్షన్ సభ్యుడు షఫీవుల్లా పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న న్యాయమూర్తి హరిణి

పావగడ: చట్టం ముందు అందరూ సమానులే అని, స్థానిక తాలూకా న్యాయసేవా సమితి అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎంఎస్ హరిణి అన్నారు. శనివారం స్థానిక స్వామి వివేకానంద కళాశాల ఆవరణలో నిర్వహించిన మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మౌలిక సదుపాయాలకు న్యాయ రక్షణ ఉంటుందన్నారు. మానవ హక్కుల అంశంపై ఏర్పాటు చేసిన చర్చా పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ సేవా సమితి కార్యదర్శి, ప్రధాన సివిల్ జడ్జి శ్రీకాంత్ రవీంద్ర, న్యాయమూర్తి కుమారి విస్మిత, మానవ హక్కులు, అవినీతి వ్యతిరేక సంస్థ అధ్యక్షుడు ఇమ్రాన్ ఉల్లా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, కార్యదర్శి హెచ్ ఏ ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్ర పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

పావగడ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన చేనేత సన్మాన్ యోజన ప్రయోజనాలను అర్హులందరికి అందించి ఆదుకోవాలని చేనేత కార్మికులు అనిల్, గోవింద, గంగాధర్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వైఎన్ హొసకోటలో చేనేత కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం నాయకుడు అనిల్ మాట్లాడుతూ..వైఎన్ హొసకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు ఉండగా.. వారిలో కేవలం 4 వేల మందికి మాత్రమే యోజన ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. అయితే మగ్గాల యజమానుల కుటుంబ సభ్యులు మాత్రమే పే జాన్ కార్డులు పొందారని తెలిపారు. చేనేత కూలీలకు పే జాన్ కార్డులు అందక పోగా.. సన్మాన్ యోజన ప్రయోజనాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల రాష్ట్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

పావగడ: మొబైల్, టీవీ, సినిమాల ప్రభావంతో ప్రాచీన జానపద కళలు అంతరించి పోతున్నాయని స్థానిక చరిత్ర పరిశోధకుడు సణ్ణ నాగప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తాలూకాలోని సీకే పురంలో విమోచన సామాజిక విద్యాభివృద్ధి సంస్థ, కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో శనివారం జానపద కళోత్సవ వేడుకలు నిర్వహించారు. కళల రక్షణకు ప్రభుత్వం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, పంచాయతీ అధ్యక్షురాలు రత్నమ్మ, శివమూర్తి, చిత్తగానహళ్లి చంద్రు, హనుమంతరాయప్ప, సంస్థ అధ్యక్షుడు సీకే పురం హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం స్థానిక మండల రీసోర్స్ సెంటర్‌లో ఎంఈఓ గంగప్ప ఆవిష్కరించారు. ఇందిరా పార్కులోని పెన్షనర్ల భవనంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ ఆఫీసర్ ధనుంజయ, అసిస్టెంట్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఆదిలక్ష్మి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పుల్లప్ప శంకరప్ప పాల్గొన్నారు.

పెనుకొండ: డీఎల్‌పీఓ కార్యాలయ ఆవరణలో శనివారం యూటీఎఫ్ నాయకులు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ ఆంజినేయులు నాయక్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం



మధుమతి దంపతులను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు చౌళూరు రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం మధుమతిరెడ్డి, నాగభూషణరెడ్డి శనివారం రూ.1,00,116లు చెక్కును కమిటి సభ్యులకు అందజేసారు.

కొత్త పింఛన్ల మంజూరు

మడకశిరరూరల్: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో అర్హులైన 253 మందికి, మడకశిర నగర పంచాయతీలో 71 మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

భూ సర్వేపై గ్రామసభలు

రొద్దం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ అనంతచారి, భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బూచర్లలో భూముల రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. రైతులు సహకారం అందిస్తే సర్వే త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ సోమిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మారుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌గోపాల్ రెడ్డి, వజీర్, సర్వేయర్ మైనుద్దీన్ పాల్గొన్నారు.

మండీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

హిందూపురం టౌన్: స్థానిక మండీ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేపీ శ్రీకాంత్, కార్యదర్శిగా ఎంపీ దీపక్, కోశాధికారిగా ఆదిశేషు, ఉపాధ్యక్షుడిగా శ్యాంబాబు, సహాయ కార్యదర్శిగా నాగ నిఖిల్‌తో పాటు 10 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

హెల్పర్ యశోదమ్మకు సన్మానం

అమరాపురం: దేవగానపల్లి అంగన్‌వాడీ–1 కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న హెల్పర్ యశోదమ్మ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శివకుమార్, మంజునాథ, సూపర్‌వైజర్ లీలావతి కార్యకర్తలు, పద్మ, జ్యోతి, కెంచ నాగమ్మ, సూజాత, శ్రీదేవి, లక్ష్మీదేవి, తదితరులు ఆమెను సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

రేపు వైకుంఠ ఏకాదశి

పెనుకొండ: ఈనెల 2, 3 తేదీల్లో పట్టణంలోని ఘనగిరి ప్రసన్న వెంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, తోమాలసేవ అనంతరం స్వామి ఊరేగింపు ఉంటుందన్నారు.

వాహనాల వేలంతో ఆదాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేశారు. జీఎస్టీతో కలిపి రూ.6,96,436 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సెబ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: కొక్కవాండ్లపల్లి (ఓసీ) పాతచామలపల్లి (ఎస్సీ)లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, దేమకేతేపల్లి (బీసీ–డీ), నేసేవాండ్లపల్లి (వీహెచ్), కాపుచెన్నంపల్లి (బీసీ–ఏ)లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెనుకొండ: పెనుకొండ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు.

లేపాక్షి: మండలంలో కోడిపల్లి–2, బయన్నపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, నాయనిపల్లిలో సహాయకురాలు పోస్టు ఖాళీగా ఉన్నట్లు సూపర్‌వైజర్ గంగరత్నమ్మ శనివారం తెలిపారు.

మడకశిర: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న 3 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 7 హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. ఈనెల 7వ తేదీ 5 గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

గుంతల పూడ్చివేత

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో హొసకెర తూము నుంచి లీకేజీ నీరు రావడంతో గుంతలు పడ్డాయి. పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో వైస్ ఎంపీపీ లలితమ్మ, సర్పంచ్ గిరిజమ్మ, ప్రజల విరాళాలతో శనివారం రోడ్డుకు కంకర మట్టి వేయించి వేసి బాగు చేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

మడకశిరరూరల్: ఈనెల 19న కవి యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం హర్షణీయమని రాష్ట్ర రెడ్డి సంఘం సభ్యుడు నాగభూషణ్‌రెడ్డి అన్నారు. శనివారం సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.